# హుషారుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



వృద్ధురాలికి నమస్కారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



28వ వార్డులో ప్రచారం చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ



13వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఎంవీవీ సత్యనారాయణ ప్రచార ర్యాలీ

**ఆరిలోవ:** జీవీఎంసీ 13వ వార్డులో సోమవారం వైఎస్సార్‌సీపీ ప్రచారం హుషారుగా సాగింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులతో కలసి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత వార్డులో జోరుగా ప్రచారం చేపట్టారు. పార్టీ జెండాలు, ఫ్యాన్ ఆకారంలో బెలూన్లు పట్టుకొని కార్యకర్తలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారం ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ప్రారంభమై పాండురంగాపురం, వెరినదుర్గానగర్, దుర్గా బజార్, సాయినగర్, శ్రీకాంత్‌నగర్, జేఎస్ఎన్‌యూ ఆర్ఎం కాలనీ, 40 గజాల కాలనీ, దీన్‌దయాల్‌పురం ప్రాంతాలలో ప్రచారం చేశారు. అన్ని కాలనీల వీధుల్లో తిరుగుతూ ఎంవీవీ సత్యనారాయణ స్థానికులను పలకరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగాను, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గూడపాటి విక్టర్, ఎస్సీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, అటవీ విభాగం డైరెక్టర్ వనము వరలక్ష్మి, వానపల్లి ఈశ్వరరావు, బేత దుర్గారావు, కె.శిరీష, సత్యాల సాగరిక పాల్గొన్నారు.

**ఏయూ క్యాంపస్:** జీవీఎంసీ 22వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమవారం వార్డులోని పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. శివాజీపాలెం ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కోసం వివరించారు.

**21వ వార్డులో..**

**ఏయూ క్యాంపస్:** స్థానిక 21వ వార్డు చినవాల్తేరు చేపల మార్కెట్, నేతాజీ వీధి, ప్రాంతాలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు మధుపాడ రవికుమార్ ప్రజలతో మమేకమై ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

**బీచ్ రోడ్డు:** వైఎస్సార్‌సీపీకి మద్దతుగా జీవీఎంసీ 28వ వార్డులో సోమవారం కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి పాల్గొని 204, 205 బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు.



21వ వార్డులో పండ్ల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రవికుమార్



22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీతల గోవింద్

## వైఎస్సార్‌సీపీలోకి ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు



సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

**ఎంవీవీ కాలనీ:** వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమితి ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఎంవీవీ ఆవిష్కరించా రు. ఎంవీవీ మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నిర్విరామంగా శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు శ్రీనివాస్, త్రినాథరావు, గౌతమ్ శివకుమార్, కృష్ణసూరప్పుడు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్ :** ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

## ఓటు హక్కుపై అవగాహన అవసరం

**ఆరిలోవ:** రానున్న సాధారణ ఎన్నికల్లో యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు తెలిపారు. ఆరిలోవ ప్రాంతం ఆదర్శనగర్‌లో యువతకు, రుషికొండ దరి గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఆయన ఓటు హక్కు వినియోగం, దాని ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక ఆయుధం లాంటిదన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఆ ఆయుధాన్ని వినియోగించి మంచి పాలకులను ఎన్నుకోవాలన్నారు. ఓటును తప్పనిసరిగా నిర్భయంగా వినియోగించుకోవడానికి యువత ముందుకు రావాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. దీంతో పాటు సైబర్ నేరాలు, దిశ చట్టంపై కూడా అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు బలికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు.



గాయత్రీ కాలేజీలో మాట్లాడుతున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

## క్లుప్తంగా

### సివిల్ ఇంజినీరింగ్‌లో సునీల్‌కు డాక్టరేట్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి సునీల్ నందిపాటికి డాక్టరేట్ లభించింది. జేఎన్‌టీయూ అనంతపురం ఉపకులపతి ఆచార్య జి.వి.ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'బొగ్గు, సిరామిక్, స్టీల్ పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఉపయోగించి భవన నిర్మాణానికి ఉపయుక్తమైన బ్లాక్స్ తయారు చేయడం, వాటి నాణ్యత, ఇంధన వినియోగ సామర్థ్యత అధ్యయనం'పై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సునీల్ స్వీకరించారు. ఈ సందర్భంగా సునీల్‌ని విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

### బీసీవై పార్టీ అభ్యర్థి ప్రచారం



కరపత్రం అందిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న యడ్ల వేణుగోపాలకృష్ణ

**ఏయూ క్యాంపస్:** శాసనసభ ఎన్నికల్లో బీసీవై పార్టీ తరఫున పోటీ చేస్తున్న యడ్ల వేణుగోపాలకృష్ణ సోమవారం తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని యడ్ల తెలిపారు.

### న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇమంది



శ్రీనివాసరావు

**అల్లిపురం :** న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుగా ఇమంది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నట్లు న్యాయవాద పరిషత్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి అశ్విన్‌కుమార్ తెలిపారు. గత ఆదివారం ద్వారకానగర్, పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు రామరాజు తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

### రైతుబజార్‌లో తనిఖీలు

**సీతంపేట:** లీగల్ మెట్రాలజీ డిస్ట్రిక్ట్ కంట్రోలర్ కె.టి.రవికుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్ పి.డి.వి.అప్పలరాజు, వేయింగ్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు సోమవారం నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు చేపట్టారు. ధర్మకాటా ఏర్పాటు చేసి వినియోగదారులు తీసుకునే కూరగాయల బరువు సరిగా ఉన్నది లేనిదీ పరిశీలించారు. రైస్ బ్యాగుల బరువు తనిఖీ చేశారు. రైతులు, డ్వాక్రా వ్యాపారులు, కిరాణా వ్యాపారులు గడువులోగా కాటాలకు సీళ్లు వేయించుకోవాలని సూచించారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

### ముగిసిన సంస్కృత శిక్షణ తరగతులు



శిక్షణ ముగించుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంజుల

**డాబాగార్డెన్స్ :** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 26 వరకు సంస్కృత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహు భాషల్లో ప్రావీణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ వై. లక్ష్మి, శిక్షకుడు శుభ్రజిత్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- నియోజకవర్గంలో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం



18వ వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

**ఎంవీవీ కాలనీ:** విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. సోమవారం 99వ రోజు 18వ వార్డు అప్పుఘర్, మూలపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఓటర్లు మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా సీఎం జగన్ రాష్ట్ర ప్రగతికి బాటలు వేశారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, వాసుపల్లి ఎల్లాజీ, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# సముద్రాలపై అవగాహన



విజేతలైన మధురానగర్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

**ఏయూ క్యాంపస్:** సముద్రాలపై అవగాహన కల్పించడం, వాటి సంరక్షణ దిశగా ప్రజలను నడిపించడం ఎంతో అవసరమని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ అన్నారు. బీచ్ రోడ్డులోని ఐసీఏఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ 67వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సముద్ర జీవావరణంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, వాటి ప్రాముఖ్యతను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

విశాఖపట్నం ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ సంస్థ సాధిస్తున్న ప్రగతిని, విశేషాలను వివరించారు. నిబద్ధత ప్రగతి, ఆవిష్కరణ దిశగా సాగిస్తున్న అభివృద్ధిని నిదర్శనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం నిలుస్తోందన్నారు. ఆరు దశాబ్దాలుగా ఎంతో ముఖ్యమైన పరిశోధనలను తమ కేంద్రం నిర్వహించిందన్నారు. ఐసీఏఆర్–సీఎంఎఫ్ఆర్ఐ ప్రాంతీయ కేంద్రం రీజినల్ హెడ్ డాక్టర్ జోయ్ కిజకుడన్ మాట్లాడుతూ చేపల పెంపకం పరిశ్రమలకు, ఈ రంగానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు బ్యాలన్సింగ్ ఓషన్ హెల్త్ అండ్ హ్యూమన్ నీడ్స్ అంశంపై పోటీలు నిర్వహించారు. జీవీఎంసీ మధురానగర్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. వారికి అతిథులు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

# యథేచ్ఛగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు

ముస్లింల సమావేశంలో శ్రీభరత్, విష్ణుకుమార్‌రాజు కోడ్ ఉల్లంఘన



నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

**బీచ్ రోడ్డు:** టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, బీజేపీ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘించారు. మతపరమైన సమావేశాలు నిర్వహించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధం. ఇదే విషయమై శ్రీభరత్‌కు జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన అనుమతుల్లో స్పష్టంగా ఉంది. అయితే సోమవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ మాట్లాడుతూ రాజకీయ ఉపన్యాసాలు చేయకూడదని ఆదేశాలు ఉన్నాయని అంటూనే వైఎస్సార్‌సీపీపై విమర్శలు గుప్పించారు. మతాలు, కులాలు ప్రస్తావించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. విష్ణుకుమార్‌రాజు అయితే తన ప్రత్యర్థి అయిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె.కె.రాజును రౌడీ అంటూ పదే పదే సంబోధించారు. మతపరమైన సమావేశంలో ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమంటూ పలువురు చర్చించుకున్నారు.

**శ్రీభరత్ వస్తేనే భోజనం**

జన సమీకరణలో భాగంగా ముస్లింల కుటుంబ సభ్యులతో సహా సమావేశానికి సాయంత్రం 5 గంటలకే తరలించారు. అయితే భరత్ రాత్రి 8.50 గంటల వరకు సమావేశానికి రాకపోవడంతో ఆకలితో అలమటించారు. భోజనం పెట్టాల్సి ఉంటుందని పిల్లలను ఎందుకు తీసుకొచ్చారంటూ నిర్వాహకులు నిలదీయగా వారు నివ్వెరపోయారు. ఈ సమావేశం పెట్టింది భరత్.. కాబట్టి ఆయన వచ్చే వరకు ఎవరికి భోజనం పెట్టేదేలే అని తేగేసి చెప్పారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నృత్య కళాకారులకు సత్కారం

**అగనంపూడి:** నంది అవార్డు గ్రహీత, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించిన జె.సురేష్ కుమార్, ఇంటర్నేషనల్ డాన్స్ అవార్డు గ్రహీత కోరువాడ నాగమణిలను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని సత్కరించారు. కళాకారులను ప్రోత్సహించాలని నటశేఖర కళా సమితి వ్యవస్థాపకుడు విందుల వరహాలు, దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు అప్పారావు కోరారు.

# అసెంబ్లీ బరిలో 14 మంది అభ్యర్థులు



**ఆరిలోవ:** విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. తూర్పులో ఎమ్మెల్యే అభ్యర్థులుగా 23 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో 8 నామినేషన్లను వివిధ కారణాలతో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్ తిరస్కరించారు. మిగిలిన 15 మంది నామినేషన్లలో గడువు రోజైన సోమవారం స్వతంత్ర అభ్యర్థిగా ఎం.సురేష్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రస్తుతం తూర్పు నియోజకవర్గం బరిలో 14 మంది అభ్యర్థులు మిగిలారు. వారిలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జాతీయ కాంగ్రెస్ పార్టీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు 9 మంది కాగా.. స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు ఉన్నారు. ఎన్నికల అధికారులు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కూడా కేటాయించారు.

| అభ్యర్థి | పార్టీ |
|---|---|
| ఎంవీవీ సత్యనారాయణ | వైఎస్సార్‌సీపీ |
| వెలగపూడి రామకృష్ణబాబు | తెలుగుదేశం |
| గుత్తుల శ్రీనివాసరావు | జాతీయ కాంగ్రెస్ |
| పీటర్ జోసెఫ్ | బహుజన సమాజ్ పార్టీ |
| ఇ.హైమావతి | పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా |
| తోట వెంకటసాయి ముకుంద | ప్రజా ప్రస్థానం పార్టీ |
| యెడ్ల వేణుగోపాలకృష్ణ | భారత యువజన చైతన్య పార్టీ |
| కొంగరాపు గణపతి | రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా |
| అదపాక దాలిరాజు | నవభారత నిర్మాణ సేవా పార్టీ |
| ఆదాడ రమణి | స్వతంత్ర అభ్యర్థి |
| ఉమ్మడి భాస్కరరావు | స్వతంత్ర అభ్యర్థి |
| శివరామకృష్ణ అనగాని | స్వతంత్ర అభ్యర్థి |
| బర్ల అప్పారావు | స్వతంత్ర అభ్యర్థి |
| వడ్డి శిరీష | స్వతంత్ర అభ్యర్థి |

### 2,92,206 మంది ఓటర్లు

తూర్పు నియోజకవర్గంలో 2,92,206 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 15 వరకు కొత్తగా ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించడంతో అర్హులైన యువత, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. ఓటరు నమోదు కార్యక్రమం గడువు ముగిసేనాటికి 2,92,606కు ఓటర్ల సంఖ్య చేరింది. వారిలో పురుషులు 1,42,540 మంది కాగా.. మహిళా ఓటర్లు 1,49,646 మంది ఉన్నారు. మరో 20 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. ఈ ఓటర్లు బరిలో నిలిచిన ఏ అభ్యర్థికి విజయావకాశం కల్పిస్తారో వేచి చూడాలి.

## కాలుష్యరహిత విశాఖే లక్ష్యం



సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

**డాబాగార్డెన్స్ :** వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు దానిని అనుసరిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## ఐఐఎంలో శిక్షణ తరగతుల ప్రారంభం



శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

**ఏయూ క్యాంపస్:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో మహానంది కోల్‌ఫీల్డ్ లిమిటెడ్‌కి సంబంధించిన అధికారులకు ఐదు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి రంగంలో అత్యుత్తమ సంస్థల్లో ఒకటిగా ఎంసీఎల్ కీలక భూమిక పోషిస్తోందన్నారు. వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అంతర్గతంగా, వ్యవస్థాగతంగా నాయకత్వం ఎంతో అవశ్యకమన్నారు. పదవిని అలంకరించడం, నాయకత్వాన్ని కలిగి ఉండడం మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. కాలానుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎం.వి.అనూరాధ, ఆచార్య భిక్ష మంజుదార్, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహాంజలి నృత్యాలయంలో రేపటి నుంచి వేసవి శిక్షణ



వేసవి శిక్షణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**ఆరిలోవ:** జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని స్నేహాంజలి నృత్యాలయంలో బుధవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నృత్యాలయం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు నృత్యాలయంలో సోమవారం వేసవి శిక్షణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ శిబిరంలో 5 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీ, పురుషులకు కూచిపూడి, వెస్టర్న్ డాన్స్ నేర్పుతామన్నారు. మే 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నృత్యం కోసం చేరిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. 15 ఏళ్లుగా ఇంత వరకు సుమారు 8000 మందికి నృత్యం నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వి.సత్యనారాయణ, వి.శైలజ, వి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# చోరీ సొత్తు రికవరీ

- జీఆర్పీ అదుపులో నిందితులు



నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

**తాటిచెట్లపాలెం:** వివిధ రైళ్లు, రైల్వే స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సోమవారం జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు, హెడ్ కానిస్టేబుల్ ఎల్.ఉదయ్‌భాస్కర్, ఆర్పీఎఫ్ ఎస్ఐ జేకే మీనాలు తమ తమ సిబ్బందితో విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా రైళ్లలో దొంగతనాలు చేసే ముఠా సభ్యులు పట్టుబడ్డారు. పల్లపు ముత్యాలు, పల్లపు మురళీ, గొబ్బూరు శ్రీనివాసరావు అనే గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన దొంగలముఠా సభ్యుల నుంచి సుమారు 16 గ్రాముల బంగారు గొలుసును, రూ.15 వేల నగదును రికవరీ చేశారు. వీరు ఈ వస్తువులు, నగదును ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లుగా అంగీకరించడంతో చోరీ సొత్తును రికవరీ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.